క్లుప్తంగా

ఘనంగా ఏరువాక పౌర్ణమి



పామర్రు: జేష్ఠ మాసం బహుళ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా జరుపుకుంటారు. బుధవారం పౌర్ణమి కావడంతో రైతులు తమ ఎడ్లకు ప్రత్యేకంగా పూజలు చేసి, అరకలకు పసుపు కుంకుమలతో పూజ చేసి పొలాల్లో దున్నే కార్యక్రమం చేపట్టారు. ఈ విధంగా ఏరువాక పౌర్ణమి నుంచి రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమై సాగుకు సన్నద్ధం కావడం ఆనవాయితీ. పంటలు బాగా పండాలని పూజలను చేశారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సౌత్ రీజినల్ ఆడిటర్ పీఎల్వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వికాస్ పరిషత్ అధ్యక్షురాలు టి. హారిక, బొగ్గారపు తిరుపతయ్య, జ్ఞానచంద్ జైన్, జి.కిరణ్ బాబు, జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు తొలగిస్తే అడ్డుకుంటాం



పెనమలూరు: కానూరు గుమ్మడితోటలో పేదల ఇళ్లు అన్యాయంగా తొలగిస్తే సీపీఎం అడ్డుకుంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ ఖాశిం అన్నారు. సీపీఎం నాయకులు బుధవారం గుమ్మడితోటలో కాలువ కట్టపై ఉన్న నివాసితుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా ఉంటున్న పేదల ఇళ్లు తొలగిస్తామని తహసీల్దార్ నోటీసులు ఇవ్వటం దారుణమన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీ, అధికారులు పేదల పట్ల అన్యాయంగా వ్యవహరించటం తగదన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించిన తరువాతే పేదలు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తారన్నారు. అప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్‌వలి, మాదు నాగేశ్వరరావు, రత్నకరుణ, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి



తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరు–1 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారం, ఆటలు, పాటలు, చదువుపై నాగమల్లేశ్వరి తెలిపారు.

ఏఎంసీ చైర్మన్‌గా పొట్లూరి ప్రమాణస్వీకారం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పొట్లూరి రవికుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన్ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు తదితరులు ఈ సందర్భంగా అభినందించారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం చండీ హోమాన్ని వేద మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ వేద పండితుల బృందం ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

చానల్ ఇలా.. మురుగు పోయేదెలా?

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పామర్రు: వేసవి కాలం పూర్తి కావస్తున్నా పామర్రు మురుగు చానల్ (డ్రెయిన్)ల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఏళ్లుగా చానల్లోని మురుగు తొలగింపు పనులు చేపట్టని కారణంగా మురుగు దిగువకు ప్రవహించక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పామర్రులోని చల్లపల్లి రోడ్డులోని మురుగు డ్రెయిన్ మురుగు, కోటిరెడ్డిపేటలో మురుగు, వీరాంజనేయపురం కాలనీలోని మురుగు అంతా దీనిలో కలుస్తోంది. ఇది చివరకు వేల్పూరు మురుగు డ్రెయిన్‌లో కలుస్తుంది. ఈ చానల్ అంతా గుర్రపు డెక్క, తూడు కాడ నాచు తదితరాలు పేరుకుపోవడంతో మురుగు దిగువ ప్రాంతాలకు ప్రవహించడం లేదు. ఎక్కడి మురుగు అక్కడే అన్న చందాన ఉంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టాలని స్థానిక రైతులు, ప్రజలు వాపోతున్నారు.



పామర్రు చానల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

వృథాగా పోతున్న నీరు

పామర్రు చానల్‌కు పక్కనే ఉన్న నాగులేరు కాలువ నుంచి ఓ తూము ద్వారా ఎప్పుడు కావాల్సి వస్తే అప్పుడు నీటిని తీసుకునే విధంగా తూము ఏర్పాటు చేశారు. ఈ తూముకు అడ్డంగా తలుపు లేక పోవడంతో కాలువ లోని నీరు నిరంతరం చానల్లోకి చేరుతూ నీరు వృథా అవుతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక రైతులు పలుమార్లు అధికారులకు వివరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుర్రపుడెక్కను తొలగించాలి

పామర్రు చానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తూడు కాడల వలన పంట పొలల్లోని మురుగు దిగువకు ప్రవహించక ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చానల్లో పూడు పేరుకుపోవడం కారణంగా నీటి ప్రవాహం తగ్గిపోయింది. అధికారులు స్పందించి మురుగు డ్రెయిన్‌లోని గుర్రపు డెక్క, తూడు కాడలను, పేరుకు పోయిన పూడును వెంటనే తొలగించాలి.

– మరెడ్డి అంజిరెడ్డి, రైతు, పామర్రు

త్వరలో పనులు చేపట్టేందుకు చర్యలు

పామర్రు చానల్లో గుర్రపు డెక్క తొలగించాలని, పూడిక తీత పనులు అవసరమని గుర్తించాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకుంటాం.

– భగవతి, డ్రెయినేజీ ఏఈఈ

ఆకట్టుకున్న కోలాటం

తోట్లవల్లూరు: యాకమూరులోని కోదండరామస్వామి ఆలయం వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన శ్రీబృందావనమాలి కోలాట భజన పలువురిని ఆకట్టుకుంది. గురువు అచ్చిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సుమారు 40 మంది కోలాట భజన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కోలాట భజనను వీక్షించి తన్మయత్వం చెందారు. చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, గుర్రాల ఆదినారాయణ, తలుపుల మాధవి, కలకోట సుజాత, చొప్పరపు వెంకట సుబ్బమ్మ, వెలివెల వెంకట రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

అలరించిన చెక్క భజన

పామర్రు: శ్రీవేణుగోపాల బృందావన భజన సమాజం ఆధ్వర్యంలో స్థానిక విష్ణాలయంలో నిర్వహించిన చెక్క భజన కార్యక్రమం భక్తులను అలరించింది. ఈ సందర్భంగా భజన గురువులు కొల్లి సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలలుగా 25 మంది చిన్నారులు చెక్క భజనను నేర్చుకున్నట్లు తెలిపారు. చిన్నారుల వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేవిధంగా ఖాళీ సమయాల్లో ఈ భజన నేర్పించామన్నారు. అంతరించిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే విధంగా చిన్నారులకు ఈ భజన నేర్పించినట్లు పేర్కొన్నారు. పలు భక్తి పాటలను గురువు ఆలపించగా తాళ యుక్తంగా చెక్క భజన చేస్తూ చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.



యాకమూరులో కోలాట భజన నిర్వహిస్తున్న భక్తులు



చెక్క భజన ప్రదర్శన

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

గుడ్లవల్లేరు: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గుడ్లవల్లేరు తహసీల్దార్ బి.లోకరాజుకు మండల రిపోర్టర్ల తరఫున కె.కోటేశ్వరరావు, ఐ.రాంబాబు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు హోంమంత్రి నేతృత్వంలో హై పవర్ కమిటీ, జిల్లా స్థాయిల్లో పోలీసు ఉన్నతాధికారులతో కమిటీలు వేయాలన పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జర్నలిస్టుల ఆరోగ్య బీమా సదుపాయాన్ని రెన్యువల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

భక్తుల కొంగు బంగారం ఉప్పలమ్మ

గుడ్లవల్లేరు: కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా శ్రీ ఉప్పలమ్మ తల్లి అని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. గుడ్లవల్లేరు మండలం పెంజెండ్ర శివారు సింగలూరులో ఉప్పలమ్మ, యల్లమ్మ సంబరాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, గుడ్లవల్లేరు సంత కమిటీ డైరెక్టర్ వల్లభనేని కృష్ణప్రసాద్, శీరం సురేష్, కృష్ణప్రసాద్, మురాల నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కేశన మహేష్, మిరియాల రాజేంద్రప్రసాద్, అనగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఉప్పాల రాము

పాఠశాలకు ఐరన్ రైలింగ్ ఏర్పాటు

ప్రాకర్ల(పామర్రు): దాత సహకారంతో పాఠశాలకు ఐరన్ రైలింగ్ ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల హెచ్ఎం రాయన శివరామప్రసాద్ తెలిపారు. మండలంలోని ప్రాకర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దాత సహకారంతో ఐరన్ రైలింగ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాల చుట్టూ రైలింగ్ లేని కారణంగా పాఠశాలల్లో తరచూ కోతులు కుక్కలు వస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుండేవి. ఈ విషయాన్ని స్థానికులు మట్టా శివ ప్రసాద్‌కు తెలియజేశారు. స్పందించిన శివప్రసాద్ తన తండ్రి పాండురంగారావు జ్ఞాపకార్థంగా సుమారు రూ.60 వేల విలువైన ఐరన్ రైలింగ్‌ను పాఠశాలకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొంతుపులి రామలింగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ గొంతుపులి ఆనంద్‌మోహన్, ఉపాధ్యాయుడు గణేష్ పాల్గొన్నారు.



దాత సహకారంతో పాఠశాలకు ఏర్పాటు చేసిన ఐరన్ రైలింగ్

రేపు విద్యుత్ అదాలత్

పామర్రు: మచిలీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఉదయం10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల స్థానిక పాల కేంద్రం కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ సుందరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జీ గోవిందయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. పామర్రు డివిజన్ పరిధిలోని పామర్రు, పమిడిముక్కల, మొవ్వ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియపరిచి పరిష్కారం చేసుకోవాలని కోరారు.

బస్‌పాస్ కౌంటర్లకు సెలవు

గుడివాడ టౌన్: గుడివాడ ఆర్టీసీ డిపోలో బస్‌పాస్ కౌంటర్లను ఈ నెల 12, 13 తేదీలలో మూసి వేస్తున్నట్లు డిపో మేనేజర్ డి.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా ఈ నెల 14వ తేదీ నుంచి విద్యార్థులకు పాస్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు వచ్చి పాస్ పొందవచ్చని తెలిపారు.

పలువురు అధికారుల బదిలీ

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణానికి చెందిన పలువురు అధికారులు బుధవారం బదిలీ అయ్యారు. గుడివాడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వాసిరెడ్డి కోటేశ్వరరావు వత్సవాయి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో రావాల్సిన తహసీల్దార్‌ను ప్రభుత్వం నియమించలేదు. వ్యవసాయ శాఖ ఏడీఏగా నిమ్మగడ్డ రమాదేవి బంటుమిల్లి బదిలీకాగా ఆమె స్థానంలో ఏలూరు ఏడీఏ ఎస్.కవిత గుడివాడకు బదిలీపై వచ్చారు. మార్కెట్ యార్డు కార్యదర్శి బి. భాస్కరరావు మచిలీపట్నం బదిలీ కాగా కైకలూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా పని చేయుచున్న బి.సౌజన్య గుడివాడకు బదిలీ అయ్యారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని ఓ కూల్‌డ్రింక్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో ఉన్న రాయల్ కూల్‌డ్రింక్స్ షాపు తాళాలు మంగళవారం అర్ధరాత్రి దొంగలు పగులగొట్టి రూ.10 వేల నగదు, రూ. 30 వేలకుపైగా విలువైన సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించారు. పగులగొట్టిన తాళాన్ని సమీపంలోని రాజస్థాన్ టీ స్టాల్ వద్ద దొంగలు పడవేశారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు షాపు యజమాని ఖాదర్ తెలిపారు.



తోట్లవల్లూరు సెంటర్‌లో చోరీ జరిగిన కూల్‌డ్రింక్ షాపు

నేడు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

గుడివాడ టౌన్: రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో ఆచార్య రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయ కర్త, జిల్లా నోడల్ అధికారి డి. సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రైతులకు వివిధ పంటలలో సాగుకు కావలసిన సూచనలు, నూతన పరిజ్ఞానం, ఇతర సంబంధిత విషయాలపై అవగాహనా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని విశేషాభిషేకాలను చేపట్టారు. నవమ పుష్పయాగ మహోత్సవాన్ని వేద పండితులు చేపట్టారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో ఈ అభిషేకాలను నిర్వహించారు.



స్వామివార్లకు అభిషేకాలను నిర్వహిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా సుదర్శన, ధనలక్ష్మీ హోమాలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో బుధవారం శ్రీసుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రతువును చేపట్టారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికలో పరాశరం రామకృష్ణ, ఆయన శిష్య బృందంచే శ్రీసుదర్శన నరసింహా లక్ష్మీగణపతి, ధనలక్ష్మి, నవగ్రహ హోమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, సభ్యులు జాస్తి శ్రీనివాసరావు నేతృత్వంలో హోమ క్రతువును పూర్తిచేశారు. పంటలు సంవృద్ధిగా పండాలని, రైతులు బాగుండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ హోమం నిర్వహించినట్లు శ్రీధర్ తెలిపారు. అనంతరం మహా పూర్ణాహుతిని సమర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆల య కమిటీకి చెందిన జాస్తి ఫణికుమార్, మోదుగు మూడి వేణు, చిమట శ్రీను, గూడపాటి సీతారాంబాబు, కాసరనేని నాని తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా బలుసులమ్మ సంబరం

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు ఐనంపూడిలో బలుసులమ్మ సంబరం బుధవారం ఘనంగా జరిగింది. ఏటా ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఈ సంబరాన్ని నిర్వహిస్తారు. అమ్మవారి ఉత్సవాలు సోమవారం ప్రారంభం కాగా బుధవారం జరిగిన సంబరంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు సంబరంలో పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు.

భారీ వర్షం

ముదినేపల్లి రూరల్: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన వర్షం బుధవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. గత వారం రోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు భారీ వర్షం ఉపశమనం కల్పించింది. దీనికి తోడు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు చేసేందుకు రైతులు దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. ఈ వర్షం దుక్కులు దున్నేందుకు ఉపయోగపడుతుంది.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి పరిసర గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోని పల్లపు ప్రదేశాలు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడ్డారు. స్థానిక నేషనల్ హైవేపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్వర్ణకవచంలో దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణకవచంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, ఉభయదాతలు తరలివచ్చారు. మరో వైపున శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద నిర్వహించిన ఖడ్గమాలార్చనకు 33 టికెట్లను విక్రయించారు. రెండు షిఫ్టులలో అమ్మవారికి ఖడ్గమాలార్చన నిర్వహించారు. చండీహోమంలో 200 మందికి పైగా ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. వీటితో పాటు ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు, పరోక్ష సేవగా ఆయా సేవల్లో పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. స్థానిక వి కన్వెన్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు నిత్యం వివిధ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా నియోజకవర్గంలో ప్రజల వద్దకు తానే వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలకు సంబంధించిన సమస్యల్లో జాప్యం జరుగుతుందన్నారు. ఇందుకు కోర్టు వివాదాలే ప్రధాన అడ్డంకిగా మారుతున్నట్లు తెలిపారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెప్పారు. సొసైటీ, జిరాయితీ పట్టా భూములకు సంబంధించి 24వేల ఎకరాలు సమస్యల వలయంలో ఉన్నట్లు తెలిపారు. దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో కొల్లేరు కమిషన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, శోభనాద్రచౌదరి, నరసింహారావు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

పెదమద్దాలి(పామర్రు): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని పెదమద్దాలిలో 13 సీ సీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పామర్రులోని సీసీ రహదార్లను కూడా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామారావు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారికి శంకుస్థాపన

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ నుంచి పెదముత్తేవి మీదుగా కోసూరు–ఘంటసాల ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం సాయంత్రం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అలాగే మిషన్ పాట్ హోల్ ఫ్రీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే మస్తాన్, ఆర్అండ్‌బీ డీఈ తాతా సంగీత, ఏఈ సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రావు, మండల కార్యదర్శి వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



పెదమద్దాలిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ వర్కర్స్, స్కూల్ నైట్ వాచ్‌మెన్ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వివిధ తరగతుల కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. సకాలంలో జీతాలు రాకపోవడం వలన కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. జీతాలు పెండింగ్‌లో ఉండటం వలన ఇంటి అద్దెలు కట్టలేక పోతున్నారని, అనారోగ్యం వస్తే వైద్యానికి డబ్బు లేక, పిల్లలకు ఫీజులు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం 11వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వారి జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే అందరిని కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

గన్నవరం: కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫాం, స్టేషనరీ విక్రయాల పేరుతో జరుగుతున్న దోపిడీని విద్యాశాఖ అడ్డుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలు ప్రైవేట్ స్కూళ్ల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అక్షరాల పేరుతో విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అక్రమ పద్ధతిలో విద్యా సంస్థలు లక్షల రూపాయిలు దండుకుంటున్నాయని ఆరోపించారు. నిబంధనల విరుద్ధంగా కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫాం, స్టేషనరీ రూ.15 వేల నుంచి రూ. 35 వేలు వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని స్కూళ్లు, కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు సాధిక్‌బాబు, సిద్ధు, ప్రిన్సి, రోహిత్, అవినాష్, హుస్సేన్, మణికంఠ పాల్గొన్నారు.



గన్నవరంలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు